

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు

ఒంటిమిట్టలోని కోదండ రామాలయంలో పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సీతారామలక్ష్మణ ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో సుందరంగా అలంకరించారు. - 8లో



వైభవంగా గంధం సమర్పణ

పెద్ద దర్గాలో శనివారం హజరత్ సయ్యద్‌షా అమీనుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిష్తివుల్ ఖాద్రీ సాహెబ్ ఉరుసు ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.98	రూ.120
రెండోరకం	రూ.56	రూ.94

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 417 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

రేపు మార్కెట్‌కు సెలవు

మదనపల్లె సిటీ : వినాయకచవితి పండుగ పురస్కరించుకుని ఈ నెల 18న టమాటా మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి అభిలాష్ తెలిపారు. 17న సాయంత్రం రైతులు మార్కెట్‌కు టమాటాలు తీసుకు రావద్దని సూచించారు.

'18వ తేదీనే వినాయకచవితి'

మదనపల్లె సిటీ : వినాయకచవితి పండగ 18వ తేదీన (సోమవారం) నిర్వహించుకోవాలని కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ఆస్థాన జ్యోతిష్య, వాస్తు, పంచాంగకర్త శివకుమార్‌శర్మ తెలిపారు. కాణిపాకంలో అదే రోజున నిర్వహిస్తున్నామన్నారు. చంద్రమానం ప్రకారం చవితి తిథి 18నే ఉందన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

రాయచోటి అర్బన్ : మండలంలోని దిగువఅబ్బవరం వద్ద ఏర్పాటు చేసిన ఎంఐజీ జగనన్న స్మార్ట్ లేఔట్ నందు ప్లాట్లను పొంది 100శాతం సొమ్మును చెల్లించినవారికి ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించినట్లు అనుడా వైస్‌చైర్మన్ వై.ఓ.నందన్, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. లేఔట్‌లోని మొత్తం 250 ప్లాట్లు బుక్ అయ్యాయన్నారు. అందులో 50 మంది 100శాతం సొమ్మును చెల్లించారన్నారు. వారిలో 12మందికి శనివారం రాయచోటి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నందు జిల్లా పట్టణ ప్రణాళికా విభాగం అధికారి క్రిష్ణసింగ్, సబ్‌రిజిస్ట్రార్ గురుస్వామిలు రిజిస్ట్రేషన్ పత్రాలను అందించినట్లు తెలిపారు. ప్రతి శుక్ర, శనివారం రోజుల్లో అక్టోబరు చివరి వారం వరకు ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఏవైనా అనుమానాలుంటే అనుడా ప్లానింగ్ కార్యదర్శులు కార్తీక్ 9966223500, వేణుగోపాల్‌నాయక్ 8142636706 నంబర్లలో సంప్రదించాలన్నారు.

19న రెజ్లర్లు హాజరుకావాలి

కడప స్పోర్ట్స్ : ఎస్‌జీఎఫ్ అండర్–14, 17 విభాగాల్లో రెజ్లింగ్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19వ తేదీ సాయంత్రం 6 గంటలకు కడప రైల్వేస్టేషన్ వద్ద హాజరుకావాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.అరుణకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు విజయవాడలో నిర్వహిస్తున్నట్లు, ఇందులో పాల్గొనేందుకు రెజ్లర్లు తమ వెంట ఎలిజిబిలిటీ ఫారంలు నాలుగు సెట్లతో పాటు బోనఫైడ్, ఆధార్ సర్టిఫికెట్, గత ఏడాది మార్కులిస్టు జతపరచాలన్నారు. అందరూ కచ్చితంగా రెజ్లింగ్ దుస్తులు వెంట తీసుకురావాలని సూచించారు.

ఉచిత శిక్షణ

కడప కల్చరల్ : నిరుద్యోగ యువతకు టూరిజం, హాస్పిటాలిటీ అంశాలలో ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశం కల్పిస్తామని తిరుపతిలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్/క్యాటరింగ్ టెక్నాలజీ, అప్‌లైడ్ న్యూట్రిషియన్ సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రమణప్రసాద్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీ–డ్యాప్, దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన సహకారంతో శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 9160912690 లేదా 91005 58006 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పీఎస్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

కలికిరి : అన్నమయ్య జిల్లా ఎస్పీ బి.క్రిష్ణారావు శనివారం కలికిరి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మండల వివరాలు, క్రైమ్ శాతం, కేసుల పురోగతి తదితరాలపై ఎస్‌ఐ కె.రహీముల్లాను విచారించారు. అనంతరం రికార్డులను పరిశీలించి నిర్వహణపై సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు మధుసూదనాచారి, మహబూబ్ బాషా, హెచ్‌సీలు మనోహర్, మదన్‌మోహన్ రెడ్డి, రఫీ, పీసీలు పాల్గొన్నారు.

ప్రయాణికులకు బహుమతులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప–రాజంపేట మార్గంలో ప్రయాణించిన ఆర్టీసీ ప్రయాణికులను ప్రోత్సహిస్తూ ప్రవేశపెట్టిన గిఫ్ట్ స్కీమ్‌లో భాగంగా శనివారం లక్కీ డిప్ ద్వారా విజేతలను ప్రకటించామని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. ఇందులో భాగంగా మొదటి బహుమతి ఓబులయ్య, రెండవ బహుమతి కృష్ణయ్య, మూడవ బహుమతి రాజేష్ అనే ప్రయాణికులకు లభించాయన్నారు.

ప్రగతి బాట



- నష్టాలను అధిగమిస్తూ లాభాలబాటలోకి ఆర్టీసీ
- గాడిన పడుతున్న ప్రయాణం
- ఐదు డిపోల్లో 500 బస్సులు
- ప్రతి రోజూ 1.70 లక్షల మంది ప్రయాణికులు

మదనపల్లె సిటీ : ప్రయాణికుల అభిరుచులకు తగ్గట్టుగా బస్సుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ కొత్త బస్సులు అందుబాటులోకి తెచ్చి లాభాల బాటలో పయనిస్తోంది ఆర్టీసీ. ప్రైవేటు వాహనాల పోటీని తట్టుకుంటూ మారుమూల ప్రాంతాలకు సైతం రోజు 1.70 లక్షల మంది ప్రయాణికులను చేరవేస్తోంది. జిల్లాలో మదనపల్లె 1, 2, రాయచోటి, రాజంపేట, పీలేరు డిపోల పరిధిలో 500 బస్సు లు రోజుకు లక్ష 90 వేల కిలో మీటర్లు తిరుగుతున్నాయి.గత పాలకుల పుణ్యమా అని నష్టాల పాలైన ఆర్టీసీ.. అప్పులను తీరుస్తూ ప్రగతి బాట పట్టింది. సిబ్బంది సైతం అంకితభావంతో పని చేస్తూ సంస్థ పురోగతికి కృషి చేస్తున్నారు.

ఆర్టీసీలో నూతన శకం ప్రారంభమైంది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైపోయింది. పగిలిపోయిన అద్దాలు, చినిగిపోయిన సీట్లు, ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ప్రయాణికులు అవస్థలు పడేవారు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని 2020 జనవరిలో ప్రభుత్వంలో విలీనం చేశారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్‌గా మారిన తర్వాత దీనిన రూపురేఖలు కూడా మారిపోయాయి. ఇప్పుడిప్పుడే నష్టాలను అధగమిస్తూ లాభాల బాటలో ప్రయాణిస్తోంది. సిబ్బందికి బకాయిల చెల్లింపు, పెరుగుతున్న డీజిల్ ధరలు భారంగా మారినప్పటికి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంలో సిబ్బంది చూపిస్తున్న చొరవతో నష్టాలు తగ్గుముఖం పడుతున్నాయి. మరో వైపు ప్రైవేటు బస్సులు, వాహనాల పోటీకి తట్టుకుంటూ మారుమూలపల్లెలకు సైతం బస్సులు నడుపుతోంది. జిల్లాలోని డిపోల్లో నష్టాల నుంచి బయటపడుతున్నాయి.

ప్రతి రోజూ 1.90 లక్షల మీటర్ల ప్రయాణం

జిల్లాలో ఆర్టీసీ బస్సులు ప్రతి రోజూ 1.90 లక్షల కిలో మీటర్లు తిరుగుతున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు ప్రయాణికులను తీసుకెళ్తున్నాయి. జిల్లాలో 5 డిపోలు ఉన్నాయి. ప్రత్యేక సర్వీసులు నడపడం వల్ల డిపోలకు ఆదాయం పెరుగుతోంది.దీంతో పాటు కార్గో ఆదాయం పుంజుకుంటోంది.

జిల్లాలోని డిపోల్లో బస్సుల వివరాలు

స్టార్‌లైనర్	2
సూపర్‌లగ్జరీ	23
అల్ట్రా డీలక్స్	42
ఎక్స్‌ప్రెస్‌లు	83
పల్లెవెలుగు	312
అల్ట్రా పల్లెవెలుగు	23
బడి బస్సులు	15
ఆర్టీసీ	356
హెయిర్	144



ఆగస్టు నెలలో వచ్చిన ఆదాయం:

డిపో	ఆదాయం (రూ.లక్షల్లో)	ఓఆర్	ఈపీకె
రాయచోటి	640.75	67	37.35
రాజంపేట	425.14	68	38.31
మదనపల్లె–1	610.84	70	38.32
మదనపల్లె–2	582.77	69	38.72
పీలేరు	509.16	71	37.65

సౌకర్యాలు కల్పిస్తున్నాం



బస్సులను మంచి కండిషన్లతో తిప్పుతున్నాం. అన్ని బస్సులు బాగున్నాయి. ప్రయాణికులకు మంచి సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఆర్డినరీ బస్సుల్లో కూడా ఈపాస్ మిషన్లు ఇవ్వడం ద్వార చిల్లర సమస్య లేదు. ఫోన్ పే చేసుకోవచ్చు. ప్రజలు ఆర్టీసీల్లోనే ప్రయాణించి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి.

– రాము, జిల్లా ప్రజారవాణాధికారి.

సంస్థ అభివృద్ధికి సహకారం



డిపోల్లో పని చేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్, ఇతర సిబ్బంది అంతా నష్టాలు తగ్గించి లాభాల్లోకి వెళ్లేందుకు కృషి చేస్తున్నారు. డిపోలో నుంచి బస్సును సమయానికి బయటకు తీసి స్టాండులో పెడుతున్నారు. ప్రజలు ప్రైవేటు వాహనాల్లో వెళ్లకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరుతున్నాం.

– మూరే వెంకటరమణారెడ్డి, వన్ డిపో డీఎం, మదనపల్లె.

కష్టపడి పని చేస్తున్నాం



ఆర్టీసీ అభివృద్ధి చెందేందుకు,నష్టాలు అధిగమించి లాభాల్లో వచ్చేందుకు సిబ్బంది కష్టపడి పని చేస్తున్నారు. ప్రయాణికులతో చక్కగా వ్యవహరిస్తున్నారు. బస్సుల్లో కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణికుల క్షేమంపై దృష్టి పెట్టాం.

– రెడ్డప్ప, ఎస్ఎంయూ సీసీఎస్ డెలిగేట్, మదనపల్లె.

పేదల బతుకుల్లో వెలుగులు



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్, మార్కెట్ యార్డు చైర్మన్ తదితరులు

రాయచోటి : వైఎస్సార్ కాపునేస్తం పథకం ద్వారా పేద మహిళల బతుకుల్లో రాష్ట్ర ప్రభుత్వం వెలుగులు నింపుతోందని మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తూర్పు గోదావరి జిల్లా, నిడదవోలు గ్రామంలో బహిరంగ సభా వేదిక నుంచి వైఎస్సార్ కాపునేస్తం పథకం క్రింద వరుసగా నాలుగో ఏడాది కాపు, బలిజ, ఒంటరి, తెలగ పేద మహిళలకు లబ్దిదారుల ఖాతాలోకి కంప్యూటర్ బటన్ నొక్కి నగదు జమ చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, మార్కెట్ యార్డు చైర్మన్ వెంకటేశ్వర్లు, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి సందప్ప, వివిధ శాఖల జిల్లా అధికారులు, లబ్దిదారులు పాల్గొన్నారు. అన్నమయ్య జిల్లాలోని 10596 మంది బ్యాంకు ఖాతాలోకి రూ. 15 కోట్ల, 89 లక్షల, 40 వేలు జమ చేసినట్లు వారు చెప్పారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మహిళలు వారి కాళ్లమీద వారే సొంతంగా నిలబడుకోవాలనే మంచి ఆలోచనతో వైఎస్సార్ కాపునేస్తం పథకానికి శ్రీకారం చుట్టి ప్రతి ఏడాది రూ. 15 వేలు వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల పేద మహిళల జీవనోపాధి అవకాశాలు, వారి ప్రమాణాలు మెరుగుపరచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు.అనంతరం వైఎస్సార్ కాపునేస్తం పథకం కింద వరుసగా నాలుగో ఏడాది అన్నమయ్య జిల్లాలోని అర్హులైన 10596 మంది కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల పేద మహిళా లబ్దిదారులకు మంజూరైన రూ. 15 కోట్ల, 89 లక్షల, 40 వేలు మెగా చెక్కును ముఖ్య అతిథులు అందజేశారు.

పౌష్టికాహారం సరఫరాలో నిర్లక్ష్యం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ పద్మజ

కడప కోటిరెడ్డి సర్కిల్ : అంగన్వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారం సరఫరాలో నిర్లక్ష్యం వహించరాదని కర్నూలు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ పద్మజ సూచించారు. శనివారం కడప కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు సంబంధించిన ఆరు జిల్లాల సీడీపీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారం అందించే కేంద్రాలుగా ఉండాలన్నారు. అలాగే గర్భవతులు, బాలింతలకు ఇంటికి సరఫరా చేసే టేక్ హోమ్ రేషన్ పంపిణీలో అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. అలాగే జగనన్న సురక్ష పథకంలో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పరీక్షలు చేయించాలన్నారు. అంగన్వాడీ భవనాల నిర్మాణాలు, ఆన్‌లైన్ సేవలు తదితర అంశాలపై ఆమె ప్రాజెక్టులవారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పీడీ శ్రీలక్ష్మి, సీడీపీఓలు సునంద, వసంత, రమాదేవి, అరుణకుమారి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహితమే అభిమతం కావాలి



వినాయకుడిని తయారు చేసే పనిలో చిన్నారులు







ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతి అందుకుంటున్న చక్రధర్,మన్విత, మణికంఠ

- డీఈవో శ్రీ రాం పురుషోత్తం
- సాక్షి ఆధ్వర్యంలో మట్టి గణపతి తయారీకి విశేష స్పందన
- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు
- విజేతలకు బహుమతులు అందజేసిన డీఈవో

రాయచోటిటౌన్ : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని శనివారం శ్రీభారతీయ విద్యామందిర్‌లో సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల తయారీ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. జిల్లా విద్యాశాఖాధికారి(డీఈఓ) శ్రీరాం పురుషోత్తం ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 200 మంది చిన్నారులు పాల్గొని గణేష్ విగ్రహాలను తయారు చేశారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ చిన్నారులలో పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు సాక్షి మీడియా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పర్యావరణ హితమే మనందరి అభిమతం కావాలని ఆయన పేర్కొన్నారు. పిల్లల్లో విశేషమైన ప్రతిభ దాగి ఉంటుందని చెప్పారు.వారికి ప్రోత్సాహం అందిస్తే భావిభారత పౌరులుగా తయారవుతారని చెప్పారు. ప్రథమ బహుమతి చక్రధర్, ద్వితీయ బహుమతి మన్విత, తృతీయ బహుమతి మణికంఠ సాధించారు. మరో 8 మందికి ప్రోత్సాహక బహుమతులు కూడా అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నాణ్యమైన పెన్నులు అందజేశారు. శ్రీ భారతీ విద్యామందిర్ నిర్వాహకులు మామిడి తోరణాలు, అరటి మొక్కల మధ్య వినాయక చవితి ముందే వచ్చిందా అన్నట్లుగా ఏర్పాటు చేశారు. చిన్నారులు ఎంతో ఉత్సాహంగా, సంతోషంగా మాకే బహుమతులు వస్తాయనే నమ్మకంతో గణనాథులను తయారు చేశారు. శ్రీ భారతీయ విద్యా మందిర్ వ్యవస్థాపకుడు, డీఈవో కార్యాలయ సెక్టోరియల్ ఆఫీసర్ జనార్దన్ మాట్లాడుతూ భవిష్యత్తు తరాల వారికి సమతుల్యమైన వాతావరణాన్ని అందించే బాధ్యత మీపై ఉందని విద్యార్థులకు సూచించారు.పిల్లల్లోని ప్రతిభ వెలికి తీసే ప్రయత్నంలో భాగంగా మట్టి గణపతులను తయారు చేయించడానికి ముందుకొచ్చిన సాక్షి మీడియా వారికి కృతజ్ఞతలు తెలియచేశారు. ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్‌యూనివర్శిటీ కోఆర్డినేటర్ సీహెచ్ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. లేకపోతే భవిష్యత్ తరాల వారికి నష్టం వాటిల్లుతుందని చెప్పారు.పిల్లలు చదువుతో పాటు ఇతర కళలపై కూడా దృష్టి సారించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్ యూనివర్సిటీ ఫాకల్టీ భీమాచారి,సిబ్బంది కృష్ణ,ఎస్తబినా, సాక్షి మీడియా సిబ్బంది పాల్గొన్నారు.

మట్టిగణపతి ప్రతిమలే మేలు

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిరిస్ రసాయనాలతో గణపతి ప్రతిమలు తయారు చేయడం వల్ల కాలుష్యం పెరుగుతుంది. అందుకే మట్టితో చేసినవి ఉపయోగించడం మేలు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన సాక్షి వారికి దన్యవాదాలు.–బి.చక్రధర్, ప్రథమ బహుమతి విజేత

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వద్దు...

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వంటి రసాయన పదార్థాలతో తయారు చేసిన విగ్రహాలు ఉపయోగించొద్దు. దీనివల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుంది.మట్టి గణపతి ప్రతిమల తయారీపై అవగాహన కల్పించిన సాక్షి యాజమాన్యానికి వందనాలు.

– ఎస్ మన్విత, ద్వితీయ బహుమతి విజేత

మట్టి గణపతే..మహాగణపతి

మట్టి గణపతులను ఏర్పాటు చేసుకోవడం వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని జరగదు.అందుకే రసాయనాలతో తయారు చేసినవి ఉపయోగించొందు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతిని పూజించాలని సాక్షి దినపత్రిక ద్వారా తెలియజేయడం ఎంతో హర్షణీయం.

– బి. మణికంఠ, తృతీయ బహుమతి విజేత

గడువు పెంపు

కడప ఎడ్యుకేషన్ (వైఎస్ఆర్ జిల్లా) : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తు చేసుకోనేందుకు, పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల 25వ తేదీ వరకు గడువును పొడిగించినట్లు డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. ఈ పరీక్షకు 8వ తరగతి చదువుతూ కుటుంబ సంవత్సర ఆదాయం మూడున్నర లక్ష లోపు ఉన్న వారు అర్హులన్నారు. ఆదాయ, కుల ధృవీకరణ పత్రములు లేని విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పరీక్ష రుసుం జనరల్, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50 25వ తేదీ లోపు చెల్లించాలని తెలిపారు. ఇందుకు సంబంధించిన పత్రాలను ఈ నెల 28వ తేదీలోపు డీఈఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

30వ తేదీలోపు ఫీజు చెల్లించాలి

జిల్లాలో 2022–23 సంవత్సరానికి సంబంధించి 10వ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు వచ్చే మార్చిలో పరీక్ష రాయుటకు 30వ తేదీ లోపు ఫీజును చెల్లించాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. రూ. 50 అపరాధ రుసుంతో అక్టోబర్ 5వ తేదీ వరకు, రూ. 200 అపరాధ రుసుంతో అక్టోబర్ 11వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుంతో అక్టోబర్ 16వ తేదీ వరకు గడువుందన్నారు.

క్లుప్తంగా

వైద్యుల రక్షణ చట్టం పటిష్టం చేయాలి


మాట్లాడుతున్న ఐఎంఏ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ

రాజంపేట రూరల్ : వైద్యుల రక్షణ చట్టంలో సవరణలు చేసి పటిష్టమైన చట్టాన్ని తీసుకు రావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కోరుతున్నట్లు ఐఎంఏ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ కోరారు. స్థానిక ఐఎంఏ కార్యాలయంలో శనివారం స్థానిక ఐఎంఏ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు, ఆసుపత్రుల పైన జరిగే దాడులను నిరోధించడానికి దేశంలో మొట్టమొదటి సారిగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో చట్టం తీసుకొచ్చారని తెలియజేశారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పరిధిని విస్తృతం చేసి అన్ని రకాల వ్యాధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందులో చేర్చడం ప్రశంసనీయమని కొనియాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర మాజీ ఐఎంఏ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్ బాలరాజు, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ బీపీ పనీల్, రాజంపేట అధ్యక్షులు డాక్టర్ వీ కామేశ్వరమ్మ, కార్యదర్శి డాక్టర్ ఎం మురళీకృష్ణ, కోశాధికారి డాక్టర్ డీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మార్చురీలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కొన్నేళ్లుగా మానసిక అనారోగ్యం, నిరాశ్రయుల వార్డులో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వృద్ధుడు శుక్రవారం మృతి చెందాడు. ఆస్పత్రిలో చేరినప్పుడు ఆయన పేరు యాకోబ్ (60)గా రాశారు. ఆయన ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా వుంటే తమను సంప్రదించాలని కడప రిమ్స్ ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు శనివారం తెలియజేశారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు


ప్రధాన కుంభ ఆరాధన నిర్వహిస్తున్న వేదపండితులు


ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణ ఉత్సవమూర్తులు

ఒంటిమిట్ట : ఏకశిలానగరిలోని కోదండ రామాలయంలో శనివారం పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ ఉత్సవాలు జరిగాయి. సీతారామలక్ష్మణ ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో ఉత్సవమూర్తులను ఆశీనులు చేశారు. ప్రధాన కుంభ ఆరాధన, ద్వార పూజలు, చతుష్టానార్చన, పవిత్ర ప్రతిష్ట తదితర పూజలు నిర్వహించారు.

సాయంత్రం యాగశాలలో హోమాలు చేశారు. తిరిగి ఆదివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బాలభోగం, పవిత్ర సమర్పణ, సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఓటర్ల నమోదులో టీడీపీ నీచ రాజకీయం

- జీవించి ఉన్న వారిని మరణించినట్లుగా చిత్రీకరిస్తున్న వైనం
- ఆర్‌డీఓకు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే మేడా


ఆర్‌డీఓకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే మేడా, నాయకులు

రాజంపేట రూరల్ : ఓటర్ల నమోదులో టీడీపీ నియోజకవర్గ నాయకులు నీచ రాజకీయానికి పాల్పడుతున్నారని ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జునరెడ్డి ఆరోపించారు. జీవించి ఉన్న వారిని మరణించినట్లుగా చిత్రీకరిస్తూ ఎన్నికల కమిషన్‌కు ఆన్‌లైన్‌లో తెలుపుతూ దొంగచాటు ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డీఓ జీ రామకృష్ణారెడ్డికి శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. ఓటర్ల నమోదులో చోటు చేసుకుంటున్న అవకతవకలను ఆర్‌డీఓకు వివరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 9415 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మరణించారని, గ్రామం విడిచి వెళ్లారని తప్పుడు ఫిర్యాదులు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఆర్‌డీఓ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అర్హులైన వారి ఓటును తొలగించబోమని తెలియజేశారు. గ్రామంలో ఓటర్ల నమోదులో ఏవైనా సమస్య లుంటే తమ బీఎల్‌ఓల దృష్టికి మీ బీఎల్‌ఏలు తీసుకురావాలని తెలిపారు. ఓటర్ల నమోదులో ఎటువంటి లోటు పాట్లుకు తావులేకుండా చూస్తామని తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 9415 మంది జీవించి ఉన్న వారిని మరణించారని వారి ఓటుకు హక్కును తొలగించాలని టీడీపీ నాయకులు చేస్తున్న కుటిల ప్రయత్నాలు ఫలించబోవని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినట్లు చేస్తున్న టీడీపీ నాయకుల కుతంత్రాలను తిప్పికొట్టి వారికి బుద్ధి చెబుతామని తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తల మధ్య చిచ్చుపెట్టేందుకు టీడీపీ ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. ఏకంగా ఒంటిమిట్ట వైస్ ఎంపీపీ డాక్టర్ గీతాదేవి మరణించినట్లు ఫిర్యాదు చేయడం వారి కుటిల బుద్ధికి నిదర్శనమని తెలియజేశారు. నందలూరు మండలం వైస్ ఎంపీపీ నాయనపల్లి అనుదీప్ జయసింహ సతీమణి నళిని మృతి చెందినట్లు ప్రయత్నించటం, వారి వక్రబుద్ధికి నిదర్శనమని దుయ్యబట్టారు. కేవలం గుండ్లూరు పంచాయతీలోనే 137 మంది వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులు మరణించినట్లు చూపడం టీడీపీ నాయకుల బరితెగింపు తనానికి నిదర్శనమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జీవీ కృష్ణారావు, హస్తవరం ఉమామహేశ్వరరెడ్డి, పోలి మురళీరెడ్డి, వెలగచెర్ల గంగిరెడ్డి, పసుపులేటి సుధాకర్, డీ భాస్కర్‌రాజు, కే శివరామరాజు, సత్యాల రామకృష్ణ, ముమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, నాగా శేఖర్‌రెడ్డి, రెడ్డిమాసి రమేష్‌నాయుడు, మురళీఆచారి, గంగా కల్యాణ్‌కుమార్‌రెడ్డి, పల్లం దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

పందిళ్లపల్లి బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ చేతివాటం

- రూ.6 లక్షలు కాజేసినట్లు విచారణలో వెల్లడి
- విధుల నుంచి తొలగింపు


ఖాతాదారులను విచారణ చేస్తున్న పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అమర్నాథ్

లక్కిరెడ్డిపల్లి/గాలివీడు : గాలివీడు సబ్ పోస్టాఫీసు పరిధిలోని లక్కిరెడ్డిపల్లి మండలం పందిళ్లపల్లి బ్రాంచ్ పోస్టాఫీసులో బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ గీత.. వివిధ పథకాల కింద చిన్న మొత్తాల పొదుపు ద్వారా ఖాతాదారులు చెల్లించిన సొమ్ములో చేతివాటం ప్రదర్శించింది. రూ.6 లక్షల వరకు కాజేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ వివరాలను విచారణ అధికారి, రాయచోటి సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌చార్జి కె.అమరనాథ్ శుక్రవారం వెల్లడించారు. సాధారణ తనిఖీలో భాగంగా పందిళ్లపల్లి సబ్ పోస్టాఫీసును తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంలో అవినీతి వెలుగులోకి వచ్చిందన్నారు. ఖాతాదారుల వద్ద సొమ్మును వసూలు చేసిన బీపీఎం గీత పోస్టాఫీసులో జమ చేయకుండా కాజేసినట్లుగా ప్రాథమిక విచారణలో వెల్లడైందన్నారు. వెంటనే ఆమెను విధుల నుంచి తొలగించి, విచారణ ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు. గ్రామంలోని చాలా మంది ఖాతాదారులు తమ ఖాతా పుస్తకాలను బీపీఎం వద్దనే ఉంచడం, నగదు చెల్లింపులు జరిగినప్పుడు పుస్తకాలలో నమోదు చేయకపోవడం, ఎలాంటి సీల్ గానీ ముద్రించకపోవడం వంటి చర్యలతో అవలీలగా కాజేసినట్లు విచారణలో తేలిందన్నారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం నిందితురాలిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అవసరమైతే ఖాతాదారుల ఫిర్యాదు మేరకు పోలీసు కేసు చేసి స్వాహా అయిన సొమ్మును రికవరీ చేస్తామన్నారు. బాధితులు చెల్లించిన సొమ్ముకు రశీదు ఉంటే తమను సంప్రదిస్తే రికవరీ చేయిస్తామన్నారు. తపాలా శాఖపై ఎంతో నమ్మకంతో కూలీ నాలీ చేసుకొని వృద్ధులు, వితంతువులు, చిన్న తరహా ఉద్యోగస్తులు ఆర్‌డీ, ఆర్‌పీఎల్ఐ, టీడీ ఎస్ఎస్ఏ, మహిళా సమ్మాన్ యోజన తదితర పొదుపు పథకాల్లో పొదుపు నిమిత్తం చెల్లించిన సొమ్మును బీపీఎం కాజేయడం పట్ల ఖాతాదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని గ్రామస్తులు, ఖాతాదారులు కోరుతున్నారు.

సమగ్ర విచారణ జరిపించండి

రాయచోటి అర్బన్ : పందిళ్లపల్లె పోస్టాఫీసులో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రూ.50 అప్పు చెల్లించకపోవడంతో కత్తితో దాడి


తీవ్రంగా గాయపడ్డ ముస్తఫా

మదనపల్లె : అప్పుగా తీసుకున్న రూ.50 తిరిగి ఇవ్వకపోవడంతో జరిగిన వాగ్వివాదంలో ఆవేశంతో స్నేహితుడిని కత్తితో పొడిచి తీవ్రంగా గాయపరిచిన ఘటన మదనపల్లె మండలంలో జరిగింది. సీటీఎంకు చెందిన నాగరాజు, ముస్తఫా స్నేహితులు. మూడురోజుల క్రితం నాగరాజు మద్యం తాగేందుకు తన స్నేహితుడైన ముస్తఫా వద్ద రూ.50 అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వకపోవడంతో శుక్రవారం రాత్రి సీటీఎం క్రాస్ రోడ్డులో స్నేహితులైన నాగరాజు, ముస్తఫా ఇద్దరూ గొడవపడ్డారు. ఒకరిపై ఒకరు పరుషమైన మాటలు మాట్లాడుకుంటూ ఆగ్రహావేశాలు ప్రదర్శించారు. ఈ క్రమంలో మాటకుమాట పెరిగి పట్టరాని కోపంతో నాగరాజు తన వద్ద ఉన్న కత్తితో ముస్తఫాను పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితున్ని స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు సకాలంలో చికిత్స అందించడంతో ప్రాణాపాయం నుంచి కోలుకుంటున్నాడు. బాధితుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

మద్యం అక్రమ రవాణా వాహనాలు జప్తు

మదనపల్లె : కర్ణాటక మద్యం అక్రమంగా రవాణా చేస్తూ ఎస్ఈబీ అధికారుల తనిఖీల్లో పట్టుబడిన వాహనాలను వాటి యజమానులు క్లెయిమ్ చేయనందున చట్టప్రకారం స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకున్న 3 ద్విచక్రవాహనాలు, 5 ఫోర్‌వీలర్స్‌కు సంబంధించి ఇప్పటి వరకు యజమానులు తమవిగా పేర్కొంటూ ముందుకు రాలేదన్నారు. మూడేళ్ల కాలపరిమితిలోపు వాహన యజమానులు వాహనాలను తమవిగా పేర్కొంటూ దరఖాస్తు చేసుకోకపోతే వాటిని చట్టప్రకారం జప్తు చేసుకునే అధికారం ఎస్ఈబీ అధికారులకు ఉంటుందన్నారు. అందులో ఏపీ-03ఏయూ-8416(స్కూటీపెప్), కేఏ-51ఈడీ.4892(బజాజ్ డిస్కవర్), కేఏ-0హెచ్‌వీ4755(బ్లాక్ కలర్ హోండాషైన్), కేఏ-01ఎం976(వైట్ మారుతి కారు), కేఏ-01ఎంఈ6993(మహీంద్రా జైలో), కేఏ-51,సీ5593(టాటా గూడ్స్‌క్యారియర్), కేఏ04ఎంఏ9477 (మారుతి సుజుకి 800కారు), కేఏ-01ఎంఏ.9941(సిల్వర్‌కలర్ హోండా సిటీకారు) ఉన్నాయన్నారు. ఈ వాహనాలకు సంబంధించిన యజమానులు ఏడు రోజుల్లోపు తమ యాజమాన్యపు హక్కులకు సంబంధించి పత్రాలను మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్‌లో చూపించి వాహనాలను తీసుకెళ్లవచ్చన్నారు. లేనిపక్షంలో వీటిని చట్టప్రకారం ఎస్ఈబీ అధికారులు జప్తు చేసుకోవడం జరుగుతుందన్నారు.

బైక్‌లు ఢీకొని ఒకరి దుర్మరణం


మృతి చెందిన వెంకటసుబ్బయ్య


వెంకటసుబ్బయ్య (ఫైల్)

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఏపీఎస్పీ 11వ బెటాలియన్ ప్రధాన గేటు దగ్గర శనివారం రెండు బైక్‌లు ఢీకొనడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దవటంలోని ఆకులవీధికి చెందిన దాసరి వెంకటసుబ్బయ్య (54) అనే పాత్రికేయుడు (సాక్షి కాదు) ద్విచక్ర వాహనంలో శనివారం మధ్యాహ్నం ఒంటిమిట్టకు బయలుదేరారు. ఆయన సిద్దవటం ఎగువపేటకు చేరుకోవడంతో.. బంధువు పండుగాయల ప్రశాంతి ఆపి, భాకరాపేటలో దిగుతానని ద్విచక్ర వాహనం ఎక్కి కూర్చుంది. 11వ బెటాలియన్ ప్రధాన గేటు సమీపంలోకి రాగానే.. బి.మఠం మండలం సొదరివారిపల్లె గ్రామానికి చెందిన బేల్దారి పని చేసుకునే కత్తి చరణ్ భాకరాపేట వైపు నుంచి ద్విచక్రవాహనంలో వచ్చాడు. ఎదురెదురుగా వస్తున్న వారి వాహనాలు ఢీకొనడంతో వెంకటసుబ్బయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రశాంతికి గాయాలయ్యాయి. చరణ్‌కు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. సిద్దవటం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. వెంకటసుబ్బయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెద్ద దర్గాలో వైభవంగా గంధం సమర్పణ


దర్గా వద్దకు గంధం తీసుకొస్తున్న దృశ్యం

కడప కల్చరల్ : కడప పెద్ద దర్గాగా పేరుగాంచిన అమీన్‌పీర్ దర్గాలో శనివారం హజరత్ సయ్యద్‌షా అమీనుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిష్టివుల్ ఖాద్రీ సాహెబ్ ఉరుసు ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీపుల్లా హుసేనీ సాహెబ్ తమ ఇంటి నుంచి గంధం కలశంతో ఊరేగింపుగా దర్గాలోని గురువుల మజార్ వద్దకు చేరుకున్నారు. భక్తులైన ఫకీర్ల విన్యాసాలు, బ్యాండుమేళాల సందడితో ఊరేగింపు సాగింది. పీఠాధిపతి గురువుల మజార్ వద్ద భక్తిశ్రద్ధలతో గంధాన్ని సమర్పించి ఫాతెహా చేసి భక్తులందరికీ పంచి పెట్టారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా రాత్రి దర్గాను దర్శించుకున్నారు. గంధం ఉత్సవంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు.

ఏఆర్ రెహ్మాన్ ప్రత్యేక ప్రార్థనలు

దర్గా భక్తుడైన ప్రముఖ విశ్వవిఖ్యాత సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ గంధోత్సవంలో పాల్గొన్నారు. రాత్రి పొద్దుపోయాక దర్గాకు చేరుకున్న ఏఆర్ రెహ్మాన్ హజరత్ సయ్యద్‌షా అమీనుల్లా సాహెబ్ మజార్‌తోపాటు ఇతర గురువుల మజార్లను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

భక్తుల సందడి

ఉరుసు ఉత్సవాల కోసం శుక్రవారం నాటికే రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు దర్గా ప్రాంగణానికి చేరుకున్నారు. నిర్వాహకులు వారందరికీ వసతి, భోజన సౌకర్యం కల్పించారు. దర్గా ప్రాంగణంలో చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేయడంతో కొనుగోళ్లకు వచ్చిన జనంతో ఆ ప్రాంతం సందడిగా మారింది. దర్గా ఆవరణం పూర్తిగా రంగురంగుల విద్యుత్ దీపాలతో కనుల పండువగా అలంకరించారు.

పశుపోషణ ద్వారా ఆర్థిక పురోగతి

కడప అగ్రికల్చర్ : పశుపోషణ ద్వారా ఆర్థిక పురోగతిని సాధించవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి శారదమ్మతో పలు పథకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో పశుపోషణ ద్వారా ఆర్థిక పురోగతి కోసం గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల పెంపకంతోపాటు పశుగ్రాసం, దాణా తయారీ కోసం యూనిట్ ఏర్పాటుకు 50 శాతం రాయితీతో రుణాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. గొర్రెలు, మేకల పెంపకంలో యూనిట్ పథకంలో రూ.10 లక్షల నుంచి 50 లక్షల వరకు గరిష్టంగా రాయితీ లభిస్తుందన్నారు. కోళ్ల అభివృద్ధి పథకంలో 100 పెట్టలు, పుంజులు సామర్థ్యం గల పెరటికోళ్ల యూనిట్‌కు 50 లక్షలు యూనిట్‌కు గాను రూ. 25 లక్షల రాయితీ మంజూరు అవుతుందన్నారు.

మిద్దె మెట్లపై నుంచి జారి పడి..


మృతి చెందిన మల్లికార్జునరెడ్డి


మదనపల్లె : వర్షం పడుతున్న సమయంలో మిద్దెపై నుంచి దిగేటప్పుడు మెట్లపై నుంచి జారిపడి రైతు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బి.కొత్తకోట మండలంలో జరిగింది. బి.కొత్తకోట మండలం మొరంపల్లెకు చెందిన రెడ్డెప్పరెడ్డి కుమారుడు బి.మల్లికార్జునరెడ్డి(32) శుక్రవారం రాత్రి వర్షం కురుస్తున్న సమయంలో మిద్దెపైకి వెళ్లి హడావుడిగా కిందకు వస్తుండగా, మెట్లపై కాలుజారి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు బాధితున్ని బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రికి తరలించి, ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఇక్కడి అత్యవసర విభాగం వైద్యులు మెరుగైన చికిత్సలు అందించినా కోలుకోలేక శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. మల్లికార్జునరెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బి.కొత్తకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.

మృతదేహాలు బంధువులకు అప్పగింత


మృతదేహాలను అంబులెన్స్‌లోకి తీసుకెళ్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారిలో కేవీపల్లె మండలం కలికిరివాండ్లపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి మృతదేహాలను శనివారం బంధువులకు అప్పగించారు. శుక్రవారం తుఫాను వాహనం – సిమెంట్ లారీ ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు మృతి చెందిగా, 11 మంది తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. శనివారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో హనుమంతు, మనంద, డ్రైవర్ హనుమంతు, శోభ, అంబికా మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. మృతులు, బాధితులు కర్ణాటక రాష్ట్రం బెల్గాం జిల్లా అత్తిణి తాలూకా బడచ్చి గ్రామానికి చెందిన వారైన విషయం తెలిసిందే.

వెల్లటూరులో ప్రాచీన శిలా శాసనం


శిలా శాసనం

పెండ్లిమర్రి : మండల పరిధి వెల్లటూరు గ్రామంలో శిథిలావస్థలో ఉన్న శివాలయం సమీపంలో ప్రాచీన కాలంలోని వైద్యానికి సంబంధించిన శిలా శాసనాన్ని శనివారం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.పి ప్రసాద్ ఆధ్వర్యంలో వెలికితీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం చేపట్టిన సాహి ప్రాజెక్టులో భాగంగా దేశంలోని అన్ని ప్రాంతాల్లో వైద్యానికి సంబంధించిన శిలా శాసనాలను వెతుకుతున్నామన్నారు. వెల్లటూరులో రోడ్డు పక్కన మట్టిలో కూరుకుపోయిన శిలా శాసనాన్ని మాజీ సర్పంచ్ లక్ష్మిరెడ్డి, గ్రామస్తుల సహకారంతో వెలికితీశామన్నారు. పశువైద్యంలో వెల్లటూరు గ్రామం ప్రసిద్ధికెక్కినట్లుగా తెలిపే చరిత్ర ఈ శాసనంలో ఉందన్నారు. ఈ శాసనాన్ని భావితరాల కోసం భద్రపరచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు శ్రీనివాసరావు, రవిబాబు, మధుసూదన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

కడప జట్టు ఘన విజయం

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–19 అంతర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. శనివారం వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, గుంటూరు జట్లు పోటీపడ్డాయి. ఇందులో కడప జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు 31.4 ఓవర్లలో 119 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని తౌఫిక్ 51 పరుగులు చేశాడు. కడప బౌలర్ వరుణ్‌తేజ్ రెడ్డి 5 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 29.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. జట్టులోని ప్రణీల్‌రెడ్డి 52 పరుగులు చేశాడు. దీంతో కడప జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

విశాఖ జట్టు జయభేరి : కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో విశాఖపట్నం, రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన విశాఖ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 244 పరుగులు చేసింది. జట్టులోని శ్రీవర్ధన్ 58, యువన్ 52 పరుగులు చేశారు. సౌత్‌జోన్ బౌలర్లు బ్రహ్మసాయితేజ్‌రెడ్డి 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్ జట్టు 228 పరుగులు చేసింది. జట్టులోని రెడ్డిరుషీల్ 89, అర్జున్ టెండూల్కర్ 51 పరుగులు చేశారు. విశాఖ బౌలర్లు శ్రీవర్ధన్ 3 వికెట్లు తీశాడు. దీంతో విశాఖపట్నం జట్టు 16 పరుగుల తేడాతో జయభేరి మోగించింది.

నార్త్‌జోన్ జట్టు జయకేతనం : కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్, రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన నార్త్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది. జట్టులోని సుజాన్ 83, లోహిత్ 50 పరుగులు చేశారు. సెంట్రల్ జోన్ బౌలర్ గీత్ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్‌జోన్ జట్టు 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. జట్టులోని అభినవ్ 105, రేవంత్ నాగకుమార్ 54 పరుగులు చేశారు. నార్త్ జోన్ బౌలర్ లోహిత్ 2 వికెట్లు తీశాడు. దీంతో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు 9 పరుగుల ఆధిక్యంతో జయకేతనం ఎగురవేసింది.